ఇంటింటికీ ఇంకుడు గుంత

ఇతర ప్రాంతాలకు స్ఫూర్తిగా నిలుస్తున్న పద్మశాలీ కాలనీవాసులు

ముషీరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. నీటి కోసం వాటర్ ట్యాంకర్లపై ఆధారపడుతున్న ఈ రోజుల్లో ముషీరాబాద్ నియోజకవర్గం భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలీకాలనీ వాసులకు నీటి ఎద్దడి అంటే తెలియదు. ఎందుకంటే కాలనీలో ఇంటికో ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకుని ఇతర ప్రాంతాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

బోరింగ్‌లలో 50 నుంచి 60 అడుగుల లోతులో నీరు

పద్మశాలీ కాలనీలో సుమారు 150 ఇళ్లు ఉన్నాయి. వీరంతా కలిసి కట్టుగా ఐక్యంగా భూగర్భ జలాల పరిరక్షణకు ఇంటికో ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకున్నారు. 1998వ సంవత్సరంలో కాలనీలో మొట్టమొదటి ఇంకుడు గుంతను ఏర్పాటు చేశారు. అప్పటి ఎమ్మెల్యే ఎం.కోదండరెడ్డి, ఇంకుడు గుంతను ప్రారంభించి, కాలనీవాసులను అభినందించారు. నాటి నుంచి నేటి వరకు కాలనీలో నీటి ఎద్దడి అనే సమస్యే లేదు. బోరింగ్‌లలో కేవలం 50 నుంచి 60 అడుగుల లోతులోపే పుష్కలంగా నీళ్లు వస్తున్నాయి. కాలనీవాసులు ఏనాడు కూడా వాటర్ ట్యాంకర్ కావాలని అడిగిన సందర్భాలు లేవు.

వర్షాకాలానికి ముందే ఇంకుడుగుంతల మరమ్మతులు

ప్రతి సంవత్సరం వర్షాకాలానికి ముందే క్రమం తప్పకుండా ఇంకుడు గుంతలకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. వర్షం నీరు వృథాగా రోడ్డుపై ప్రవహించకుండా భూమిలోకి ఇంకేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రతి భవనంపై నుంచి వర్షం నీరు భూమిలోకి ఇంకేలా పైప్‌లైన్‌లను ఏర్పాటు చేసుకున్నారు. అంతేకాకుండా ఇంకుడు గుంతలలో పడే చెత్తాచెదారాన్ని తొలగించడంతోపాటు ఇంకుడు గుంతకు కావల్సిన కంకర ఇసుక తదితర వాటిని సైతం ఎప్పటికప్పుడు సమకూర్చుతూ భూగర్భజలాలను అడుగంటి పోకుండా పరిరక్షించుకుంటున్నారు.

ఐకమత్యంతో ఇంకుడు గుంతల ఏర్పాటు

పద్మశాలీ కాలనీలో ప్రజలంతా ఒకే మాటపై కట్టుబడి, పద్మశాలీ కాలనీ వెల్ఫేర్ సొసైటీ తీసుకునే నిర్ణయాన్ని కచ్చితంగా పాటిస్తున్నారు. అందులో భాగంగానే ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి ఇతర ప్రాంతవాసులకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నారు. తమ ఇంట్లో ఉన్న బోరింగ్‌లో 50 నుంచి 60 ఫీట్ల లోతులోపే నీళ్లు రావడంతో అవగాహన కల్పిస్తూ ఇతరులు కూడా ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకునేలా సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తున్నారు. జలమండలి ఉన్నతాధికారులు ఇటీవల చేపట్టిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని చెబుతూ కాలనీలో ఉన్న ఇంకుడు గుంతలను చూసి హర్షం వ్యక్తం చేశారు.





పద్మశాలీ కాలనీలో ఇంకుడు గుంత ఏర్పాటు

కాలనీకి వాటర్ ట్యాంకర్ అంటే తెలియదు



పద్మశాలీ కాలనీలో ఇంటికో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకున్నాం. వర్షం నీరు రోడ్డుపై వృథాగా పోకుండా భూమిలో ఇంకేలా ప్రతి సంవత్సరం ఇంకుడుగుంతకు మరమ్మతులు చేపడుతున్నాం. మొట్టమొదటి ఇంకుడు గుంతను కాలనీలో 1998 సంవత్సరంలో ఏర్పాటు చేశాం. మా కాలనీకి వాటర్ ట్యాంకర్ అంటే తెలియదు. ఎండాకాలంలో సైతం బోరింగ్‌లలో పుష్కలంగా నీళ్లు వస్తాయి.

- ఆర్.ఆంజనేయులు, పద్మశాలీ కాలనీ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి

తెలంగాణలో రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే



కేటీఆర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెన్ శ్రీనివాస్ రావు

ముషీరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోమవారం ముషీరాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు కేటీఆర్‌ను కలిసి ముషీరాబాద్ నియోజకవర్గంలో చేపడుతున్న పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలను వెల్లడించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో తమ సత్తా చాటాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యవంతులను చేసి, బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇచ్చేలా పనిచేయాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని కేటీఆర్ సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రజని కాంత్ గౌడ్, ముప్పిడి నర్సింగ్‌రావు, నాగేష్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

చిక్కడపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని సుప్రసిద్ధ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. విశ్వక్సేనపూజ, స్వస్తివాచనం, రక్షాబంధనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, హవనం, మహానివేదన, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలు జరిగాయి. తొలిరోజు ఈ కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు జి.రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో అన్నపూర్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆహార కల్తీని అరికట్టాలి : వినియోగదారుల మండలి

చిక్కడపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఆహార కల్తీని అరికట్టాలని వినియోగదారుల మండలి ప్రతినిధులు రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వినియోగదారుల మండలి జాతీయ ప్రధానకార్యదర్శి సాంబరాజు చక్రపాణి, దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి పల్లెపాడు దామోదర్, సభ్యులు శంకర్‌లాల్ చౌరాసియా తదితరులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం ఆహారకల్తీ సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ప్రతి చోటా టాస్క్‌ఫోర్స్ దాడుల్లో భయంకర ఆహారకల్తీ సంఘటనలు వెలుగులోకి వస్తున్న క్రమంలో ఆహారకల్తీ నిరోధానికి వినియోగదారుల సంఘాలతో కలిసి జిల్లాస్థాయిలో ప్రత్యేక నిఘావిభాగాలు ఏర్పాటు చేయాలని కోరారు. హైదరాబాద్ నగరంలోని హోటళ్లలో కల్తీ అరికట్టే బాధ్యత ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను అప్రమత్తం చేయాలని కోరారు.



వృద్ధాశ్రమంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వృద్ధులు, తెలంగాణ స్త్రీసేవా సంస్థ ప్రతినిధులు

వృద్ధాశ్రమంలో మాతృ దినోత్సవం

చిక్కడపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్త్రీ సేవా సంస్థ ఆధ్వర్యంలో మాతృదినోత్సవాన్ని సోమవారం గాంధీనగర్ డివిజన్‌లోని ఎస్‌ఆర్ వృద్ధాశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. యోగా గురువు శ్రీదేవిభారత్‌తో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కుమారి మనస్వి రితేష్ నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన వృద్ధాశ్రమంలోని వృద్ధులను ఆహ్లాదపర్చింది. విజయ్‌ంద్రపులిజాల, శ్రీలక్ష్మి స్త్రీసేవాసంస్థ ద్వారా 100 మంది వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ స్త్రీ సేవా సంస్థ అధ్యక్షురాలు డా.గురజాడ శోభాపేరిందేవి, కార్యదర్శి డి.హేమలత, కోశాధికారి శైలజ, అరుణ, శ్రీవల్లి, లలితరామస్వామి, నాగమణి పాల్గొన్నారు.



ముషీరాబాద్ భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నర్సులను సన్మానించిన కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్

వైద్యవృత్తిలో నర్సుల పాత్ర కీలకం: కార్పొరేటర్

ముషీరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తిలో నర్సులు అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకం అని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్, ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ నర్సింగ్ వ్యవస్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నర్సులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి, స్టాఫ్ నర్సులు పిహెచ్‌ఎన్ పెల్లీస్, విజయ కుమారి, సునిత, పద్మలత, సంతోషిణి, రత్నమాల, అనురాధ, శీల పాల్గొన్నారు.

బుద్ధుడి బోధనలు ప్రపంచ శాంతి, సామరస్యానికి ప్రతీకలు

నల్లకుంట, మే 12 (ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుడు భారతదేశంలో మొట్టమొదటి సామాజిక విప్లవకారుడని, ఆయన నాడు అమలులో ఉన్న సాంఘిక దుర్నీతిని, మతం పేరిట జరుగుతున్న హింసాకాండ, అమానవీయతనూ ప్రశ్నించిన వ్యక్తి అని తెలంగాణ రాష్ట్ర దళిత సేన మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ రెడ్డిమల్ల పార్వతి పేర్కొన్నారు. సోమవారం బుద్ధ పూర్ణిమ సందర్భంగా బుద్ధుడి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం హైదర్‌గూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గౌతమ బుద్ధుడి బోధనలు ప్రపంచ శాంతి, సామరస్యానికి ప్రతీకలని కొనియాడారు. హేతువుకు ప్రాధాన్యత నిచ్చి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే భావనలను నెలకొల్పడానికి గౌతమ బుద్ధుడు కృషి చేశారన్నారు.

మ్యాన్‌హోల్ మరమ్మతు పనులు పూర్తి



పనులను పరిశీలిస్తున్న వినయ్‌కుమార్, అధికారులు

చిక్కడపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ ఎస్‌ఆర్‌టీ 198 సమీపంలో మ్యాన్‌హోల్ పూర్తిగా దెబ్బతిని సివరేజీ సమస్య ఏర్పడడంతో స్థానికులు కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. జలమండలి మేనేజర్ కృష్ణమోహన్‌తో మాట్లాడిన కార్పొరేటర్ వెంటనే దెబ్బతిన్న మ్యాన్‌హోల్ మరమ్మతులు చేయాలని సూచించారు. సోమవారం జలమండలి సిబ్బంది మరమ్మతు పనులు చేపట్టారు. కార్పొరేటర్ సూచనల మేరకు బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, జలమండలి మేనేజర్ కృష్ణమోహన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌లతో కలిసి మ్యాన్‌హోల్ నిర్మాణం, మరమ్మతు పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.ఉమేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఘనంగా మహానగర సంకీర్తన

కవాడిగూడ, మే 12 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జయంతి సందర్భంగా పద్మశ్రీ డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో సోమవారం చిక్కడపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అన్నమయ్య విగ్రహం వరకు శ్రీవేంకటేశ్వర, అన్నమయ్య వారి ఆర్చామూర్తులతో పాటు చేరుకుని అక్కడ మహానగర సంకీర్తనలు నిర్వహించారు. డా.శోభరాజు రచించి స్వరపరచిన ఎక్కడున్నావ్ ఓ కల్కి దేవా, మనసారా నినుజూడ కదిలిరావా అంటూ ఒక ప్రత్యేక సంకీర్తన పాడారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామియే కల్కి, ఆయన ఖడ్గమే(శ్రీనందకమే) అన్నమయ్య అని శోభరాజు చేస్తున్న అన్నమయ్య యజ్ఞం రానున్న సమాజానికి ఎంతో మేలు చేకూరుస్తుందన్నారు.



ట్యాంక్‌బండ్‌పై అన్నమయ్య విగ్రహం వద్ద మహానగర సంకీర్తనలో పాల్గొన్న పద్మశ్రీ డాక్టర్ శోభరాజు



డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ లా కాలేజీ విద్యార్థి పి.నరేష్‌ను సత్కరించిన కళాశాల యాజమాన్యం

లా ఒక బాధ్యత గల ఉన్నత స్థానం

రాంనగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): లా అనేది ఒక్క బాధ్యత కలిగిన ఉన్నతమైన స్థానం అని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.సరోజ వివేక్ అన్నారు. ఇలాంటి ఉన్నతమైన చదువును అందిస్తున్నందుకు తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ లా కాలేజీ విద్యార్థి సత్తాచాటాడు. పి.నరేష్ 47 ర్యాంకు ఒల్టెర్ ఎల్‌ఎల్‌ఎం జూనియర్ సివిల్ జడ్జిగా సెలెక్ట్ అయిన సందర్భంగా కళాశాలలో ఘనంగా సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి మాణిక్యాలు మరి ఎంతో మంది రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ రమణకుమార్, డైరెక్టర్ వై.విష్ణుప్రియ, ప్రిన్సిపాల్ సృజన, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తలకు గాయమై వాచ్‌మన్ మృతి

కవాడిగూడ, మే 12 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి తోయడంతో కిందపడి తలకు తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వాచ్‌మన్ మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం గాంధీనగర్ పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ బోస్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. న్యూబోయిగూడలోని ఎస్‌ఎంఆర్ స్వేర్ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ భాస్కర్ (68) మరణించాడు. వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న భాస్కర్ అపార్ట్‌మెంట్ ముందు సురేష్ అనే వ్యక్తి తప్పతాగి పడుకొన్నాడు. అనేకమార్లు లేపినా లేవలేదు. భాస్కర్ అతన్ని బలవంతంగా నిద్రలేపాడు. దీంతో కోపోద్రిక్తుడైన సురేష్ వాచ్‌మన్‌ను బలంగా నెట్టాడు. దీంతో కిందపడిన భాస్కర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యచికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి భాస్కర్ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా తదితరులు

కాంగ్రెస్ నేతల సిఫారసుల మేరకే ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు అన్యాయం

రాంనగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ సభలను నిర్వహించకుండానే కేవలం స్థానిక కాంగ్రెస్ నాయకుల సిఫారసు మేరకు ఇళ్ల కేటాయింపు చేస్తున్నారని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా ఆరోపించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల విషయంలో చెబుతున్న విషయానికి, వాస్తవ పరిస్థితి మరోలా ఉందని విమర్శించారు. సోమవారం దోమలగూడలోని పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు.

పూడికతీత పనుల పరిశీలన



12ఎంఎస్‌ఆర్‌డి66: బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో రాబోయే లోతట్టు ప్రాంతాల్లో ముంపునకు గురికాకుండా ముందస్తుగా వర్షం నీటి కాలువల్లో పూడికతీత పనులను సోమవారం పరిశీలిస్తున్న కార్పొరేటర్ బి.పద్మా వెంకటరెడ్డి తదితరులు

- రాంనగర్, ఆంధ్రజ్యోతి



వీరమరణం పొందిన మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన భవానీశంకర్, రాజీవ్, మోహన్‌రావు తదితరులు

ఉగ్రవాద స్థావరాలపైనే భారత సైన్యం దాడులు

నల్లకుంట, మే 12 (ఆంధ్రజ్యోతి): భారత సైన్యం పాకిస్థాన్ ప్రజలపై దాడులు చేయలేదని, కేవలం ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు చేసిందని రాష్ట్ర ఇరిగేషన్ పూర్వ ఆఫీసర్ భవానీశంకర్ పేర్కొన్నారు. భారత సైన్యం ఆపరేషన్ సిందూర్‌లో వీరోచిత పోరాటం చేసిందన్నారు. సోమవారం నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ (ఎన్‌సీఏ) ఆధ్వర్యంలో డివిజన్‌లోని క్షత్రీయ టవర్స్ వీధిలో కశ్మీర్‌లో ఆపరేషన్ సిందూర్ సందర్భంగా సంఘీభావ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కశ్మీర్‌లో వీరమరణం పొందిన భారత జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణవేత్త డాక్టర్ జయసూర్య, నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి మోహన్‌నాయుడు, నాయకులు శ్రీనివాసరావు, కె.వీరయ్య, రమణ, సురేష్, కిరణ్, ప్రశాంత్, నరసింహమూర్తి, రమేష్, సుకుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తిచేయాలి: ఎమ్మెల్యే

గోల్నాక, మే 12 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్‌లోని ఐదు డివిజన్లలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులలో ఎలాంటి జాప్యానికి తావు ఇవ్వకుండా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. సోమవారం గోల్నాక తులసీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాలేరు వెంకటేష్ జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆయా డివిజన్లలో చేపట్టాల్సిన పనులపై నివేదికలను రూపొందించాలని ఆయన అధికారులకు ఆదేశించారు. ప్రత్యేకంగా పెండింగ్ పనులపై దృష్టి సారించాలన్నారను. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ డీఈఈ ప్రశాంతి, ఏఈ నిఖిత, వర్క్ఇన్‌స్పెక్టర్లు రవి, నరేందర్, దుర్గ, మనోహర్ పాల్గొన్నారు.

అంబర్‌పేట మీదుగా 107 బస్సుల రాకపోకలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బర్కత్‌పుర, మే 12 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. అంబర్‌పేట మీదుగా బస్సుల రాకపోకలు సాగిస్తున్నాయి. ఈనెల 7వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన '107వీ బస్సులు అంబర్‌పేట నుంచి నడపాలి' కథనానికి దిల్‌సుఖ్‌నగర్ ఆర్టీసీ డీఎం స్పందించారు. 107వీ, 107జే బస్సులు దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్, సరూర్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే దిల్‌సుఖ్‌నగర్, కంటోన్మెంట్ డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు అలీకేఫ్ చౌరస్తా, పోలీస్ లైన్, అంబర్‌పేట శ్రీరమణచౌరస్తా, చేనంబర్ చౌరస్తాల మీదుగా నడుస్తున్నాయి. సికింద్రాబాద్ నుంచి వచ్చే 107వీ, 107జే బస్సులు ఛేనెంబర్ చౌరస్తా, అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తా, పోలీస్ లైన్, అలీకేఫ్, జిందాతిలిస్మాత్‌నగర్, గోల్నాక కొత్త బ్రిడ్జి మీదుగా దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్తున్నాయి. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'కి, ఆర్టీసీ అధికారులకు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు. అంబర్‌పేట ప్రయాణికులు ఈ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరారు.

తెలంగాణ ఉద్యమంలో నాయిని పోరాటం మరువలేనిది

- ఎమ్మెల్యే ముఠా గోపాల్
- మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు



లంబాడీ తండాలో నాయిని నర్సింహారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ఎం.నాగేష్ ముదిరాజ్ తదితరులు

రాంనగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాధన కోసం దివంగత మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి చేసిన పోరాటం మరువలేనిదని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బాగ్‌లింగంపల్లిలోని లంబాడీ తండాలో నాయిని నర్సింహారెడ్డి జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాయిని నర్సింహారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర తొలి హోంమంత్రిగా నాయిని నర్సింహారెడ్డి రాష్ట్రానికి ఎన్నో సేవలందించారని కొనియాడారు. నాయిని ఆశయాలను మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి ముందుకు తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కార్మిక నాయకుడిగా, తొలి హోంమంత్రిగా రాష్ట్రానికి న్యాయం చేశారని పేర్కొన్నారు. నాయిని ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తమ కర్తవ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ఎడ్ల హరిబాబుయాదవ్, ఎం.నాగేష్‌ముదిరాజ్, రేషం మల్లేష్, సిరిగిరి శ్యామ్, కిరణ్, పరకాల మనోజ్‌కుమార్‌గౌడ్, వివేక్, నేత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో నాయిని దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రారంభించారు.

నాయిని ఆశయాలకు అనుగుణంగా పనిచేద్దాం

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ తొలి హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం నాయిని నర్సింహారెడ్డి జయంతిని పురస్కరించుకుని బీఆర్‌ఎస్ ముషీరాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిక్‌మెట్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అరుణ్ కుమార్, గోపి, మోహిన్ పాల్గొన్నారు.

- ముషీరాబాద్ డివిజన్ బాపూజీ నగర్‌లో నాయిని నర్సింహారెడ్డి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ మాజీ అధ్యక్షుడు బిక్షపతి యాదవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, బాలరాజు, సీనియర్ నాయకుడు కొండా సహదేవ్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సదా, సంతోష్ తదితరులు నాయిని చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.

నాయిని సేవలు మరువలేనివి: ఎమ్మెల్యే గోపాల్

కవాడిగూడ: తెలంగాణ ఉద్యమకారుడిగా, తెలంగాణ రాష్ట్ర తొలిహోం మంత్రిగా నాయిని నర్సింహారెడ్డి రాష్ట్రానికి అందించినసేవలు మరువేనివని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం నాయిని నర్సింహారెడ్డి జయంతి సందర్భంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని గోశాల వద్ద బీఆర్‌ఎస్ నగర నాయకుడు. కవాడిగూడ డివిజన్ మాజీ అధ్యక్షుడు కాటారం దినేష్ ఆధ్వర్యంలో వేడులను నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ హాజరై నాయిని చిత్రపటానికిపూలమాలలు వేసిని వాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర నాయకులు కాటారం దినేష్, డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్ యాదవ్, నాయకులు వై శ్రీనివాస్, బి.రాములు. రాజు యాదవ్, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరాపార్కుచౌరస్తాలో ..

మాజీ హోంమంత్రి స్వర్గీయ నాయిని నర్సింహారెడ్డి ఆశయ సాధనకు నేటియువత పాటుపడాలని రాంనగర్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బీఆర్‌ఎస్ నగర నాయకులు కల్వగోపి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇందిరాపార్కు చౌరస్తాలో ఏర్పాటు చేసిన నాయిని చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నదానం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయిని ఫౌండేషన్ వైస్‌చైర్మన్ నాయిని దేవేందర్‌రెడ్డి, కల్వగోపి, బీఆర్‌ఎస్ నాయకులు శివ, మధు, నేత శ్రీనివాస్, లడ్డు, నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ తొలి దశ ఉద్యమ నాయకుడు నాయిని

చిక్కడపల్లి: తెలంగాణ తొలిదశ ఉద్యమ నాయకుడు, రాష్ట్ర కార్మిక శాఖ మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి జయంతి కార్యక్రమం సోమవారం గాంధీనగర్ డివిజన్ జవహర్ స్కూల్ వద్ద బీఆర్‌ఎస్ నాయకుడు పున్న సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా దివంగత నాయిని నర్సింహారెడ్డి చిత్రపటానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి తనయుడు దేవేందర్‌రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ముఠారపు రాకేష్‌కుమార్, నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రీనివాస్‌గుప్తా, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.